క్లుప్తంగా

బీసీల రాస్తారోకో



వేల్పూర్: జిల్లాలో ఏ రాజకీయ పార్టీ కూడా బీసీలకు టికెట్లు కేటాయించలేదని బీసీలు ఆవేదన వ్యక్తం చేశారు. రాజకీయపార్టీల తీరును నిరసిస్తూ శనివారం వేల్పూర్ క్రాస్‌రోడ్డు వద్ద 63వ నంబర్‌జాతీయ రహదారిపై బీసీలు రాస్తారోకో చేశారు. రాజకీయ పార్టీలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. రాస్తారోకో కారణంగా రోడ్డుకు ఇరువైపులా వాహనాలు నిలిచిపోయాయి. పోలీసులు రాకముందే బీసీలు ఆందోళనను విరమించారు.

ప్యాకేజీ కోసమే పార్టీ మార్పు



వర్ని: మండలంలోని సైదిపూర్ మాజీ సర్పంచ్ కాంగ్రెస్ పార్టీ వద్ద 10 లక్షల ప్యాకేజీ తీసుకొని పార్టీ మారారని బీఆర్‌ఎస్ మండల నాయకులు, గిరిజన నాయకులు ఆరోపించారు. మండల కేంద్రంలో శనివారం బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు గిరితోపాటు నాయకులు మాట్లాడారు. కాంగ్రెస్ అభ్యర్థి ఏనుగు రవీందర్ వద్ద రూ.10లక్షల ప్యాకేజీ తీసుకొని పార్టీ మారిన మాజీ సర్పంచ్ పోచారం శ్రీనివాస్‌రెడ్డితోపాటు ఆయన కుటుంబ సభ్యులపై ఆరోపణలు చేస్తున్నారన్నారు. ఒక వ్యక్తి పార్టీ మారినంత మాత్రాన బీఆర్‌ఎస్‌కు వచ్చే నష్టమేమీ లేదని, సదరు వ్యక్తి గ్రామానికి చెందిన గిరిజన నాయకులందరూ బీఆర్‌ఎస్‌లోనే ఉన్నారన్నారు. సమావేశంలో మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు వెలగపూడి గోపాల్, సైదిపూర్ సర్పంచ్ రేఖ, ఉపసర్పంచ్ రూప్ల, నాయకులు వీర్రాజు, సరిచంద్, రమేశ్‌నాయక్, గోపి, పీర్యా, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

క్షత్రీయ పాఠశాలలో 'అరణ్య'

పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మండలం చేపూర్‌లోని క్షత్రీయ పాఠశాలలో పూర్వప్రాథమిక విద్యార్థుల క్షత్రీయ అరణ్య అనే కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో క్షత్రీయ విద్యాసంస్థల చైర్మన్ అల్జాపూర్ శ్రీనివాస్ మాట్లాడుతూ.. ప్రపంచంలో ప్రకృతి సంపదకు, ప్రకృతి అందానికి భారత దేశం నిలయమన్నారు. అటువంటి ప్రకృతి వనాన్ని బయట ప్రపంచంలోకి వెళ్ళి చూడలేక పోతున్న పూర్వ ప్రాథమిక విద్యార్థుల కోసం అరణ్య కార్యక్రమం ఏర్పాటు చేయడం అభినందనీయన్నారు. విద్యార్థుల అడవి జంతువుల వేషధారణ ఎంతగానో ఆకట్టుకుంది. విద్యాసంస్థల కార్యదర్శి అల్జాపూర్ దేవేందర్, వైస్ చైర్మన్ అల్జాపూర్ లక్ష్మీనారాయణ, కోశాధికారి అల్జాపూర్ గంగాధర్, ప్రిన్సిపల్ లక్ష్మీనరసింహస్వామి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో మాజీ సర్పంచ్ మృతి

రుద్రూర్: పోతంగల్ మండలం హెగ్డోలి మాజీ సర్పంచ్ కె.కోటేశ్వరరావు అనారోగ్యంతో మృతి చెందారు. అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందారు. రెండు పర్యాయాలు సర్పంచ్‌గా పనిచేసిన కోటేశ్వరరావు మరణవార్త తెలుసుకున్న గ్రామస్తులు, నాయకులు దిగ్భ్రాంతికి గురయ్యారు.

అన్నదానం



ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని జంబిహనుమాన్ ఆలయ ఆవరణలో భక్తులకు శనివారం అన్నదానం చేశారు. భక్తులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించే వారికే మా మద్దతు

ఇందల్వాయి: తమ సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చిన వారికే మద్దతు తెలుపుతామని దివ్యాంగులు ఏకగ్రీవంగా తీర్మానించారు. మండల కేంద్రంలోని సాయిబాబా ఆలయంలో మండల దివ్యాంగుల సంఘం సభ్యులు శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తమ సమస్యల పరిష్కారానికి హామీ ఇచ్చిన వారికే ఎన్నికల్లో మద్దతు తెలపాలని ఏకగ్రీవంగా తీర్మానించినట్లు తెలిపారు. దివ్యాంగులు, వారి కుటుంబ సభ్యుల ఓట్లు ఐదు వందల పైచిలుకు ఉంటాయని సంఘ అధ్యక్షుడు మహిపాల్‌రెడ్డి తెలిపారు. ఇంతవరకు ఏ పార్టీ ప్రతినిధులు తమను సంప్రదించకపోవడం దివ్యాంగులను అవమానించడమేన అన్నారు. సంఘ ప్రతినిధులు నవీన్, మహిపాల్ పాల్గొన్నారు.

గిరిజనుల కల నెరవేర్చిన కేసీఆర్

- కాంగ్రెస్‌ను నమ్మొద్దు
- 2200 ఎకరాలకు పోడు పట్టాలు వచ్చిన గ్రామం మానాల
- ఎన్నికల ప్రచారంలో మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి



మానాలలో మాట్లాడుతున్న మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి

కమ్మర్‌పల్లి: మానాల గిరిజనుల పోడు భూముల కలను నెరవేర్చిన ఘనత కేసీఆర్‌దేనని, రాష్ట్రంలో 2200 ఎకరాలకు పోడు పట్టాలు వచ్చిన గ్రామాలుగా మానాల, మానాలతండాలు నిలిచాయని మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. మిగతా వారికి సైతం పోడు పట్టాలు అందేలా కృషి చేస్తామన్నారు. మానాల, బడి తండా, దేగావత్ తండాల్లో శనివారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మానాలతోపాటు, అన్ని గిరిజన తండాల్లో మంత్రికి ఘన స్వాగతం లభించింది. గిరిజన మహిళలు, యువకులు దారిపొడవునా పూలు జల్లుతూ లంబాడా నృత్యాలతో మంత్రికి స్వాగతం పలికారు. ఆయా గ్రామాల్లో మంత్రి మాట్లాడుతూ... మానాల పరిధిలో పదహారు గిరిజన తండాలుంటే అందులో 8 తండాలను గ్రామ పంచాయతీలుగా మార్చామని, 'మా తండాల్లో మా పాలన' అనే గిరిజనుల కల నెరవేరిందన్నారు. మానాల, మరిమడ్లకు బీటీ రోడ్డు వేయాలని అరవై సంవత్సరాలు గిరిజనులు కోరినా.. కాంగ్రెస్, బీజేపీ, టీడీపీలు హామీలిచ్చి ఓట్లు వేయించుకున్నాయే గానీ రోడ్డు వేయలేదన్నారు. సీఎం కేసీఆర్ సహకారంతో రోడ్డును మంజూరు చేయించి పనులు పూర్తి చేయిస్తున్నానని గుర్తు చేశారు. మానాలకు బీటీ రోడ్లు, రూ.6.50 కోట్లతో తండాలన్నింటికీ లింకు రోడ్లు, రూ.4 కోట్లతో సీసీ రోడ్లు వేయించినట్లు మంత్రి వివరించారు. మానాలలో ఎవరికైనా ప్రాణాల మీదకు వస్తే ఏ కోరుట్లకో, మెట్‌పల్లికో ఎడ్లబండిపై దవాఖానకు తీసుకెళ్లే పరిస్థితి నుంచి మానాలలోనే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఏర్పాటు చేయించి ఇక్కడి ప్రజలకు వైద్య సౌకర్యాన్ని అందుబాటులోకి తెచ్చామని చెప్పారు. మానాల అభివృద్ధికి మనసు పెట్టి ఇష్టంతో పనిచేశానన్నారు. మానాల ప్రజలు తమ భూములకు కాళేశ్వరం జలాలు కావాలని కోరుతున్న విషయాన్ని సీఎం కేసీఆర్‌కు విన్నవించి సాధ్యమయ్యేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. తనకంటే ముందు కాంగ్రెస్ వాళ్లు ఎమ్మెల్యేలుగా పనిచేశారని అప్పుడు ఈ లింకు రోడ్లు, సీసీ రోడ్లు, మానాల–మరిమడ్ల రోడ్డు తదితర అభివృద్ధి పనులు ఎందుకు జరగలేదో ఆలోచించాలని కోరారు. కాంగ్రెస్ మాటలు నమ్మి ఓటేస్తే కుక్క తోక పట్టుకుని గోదావరి ఈదినట్లేనని ప్రశాంత్‌రెడ్డి ఎద్దేవా చేశారు. కర్ణాటకలో వ్యవసాయానికి పది గంటల కరెంటు ఇస్తామన్న కాంగ్రెస్ ఓట్లు దండుకొని గెలిచాక ఉన్న ఏడు గంటల కరెంటును కూడా ఎగ్గొట్టిందని విమర్శించారు. బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

భీమ్‌గల్ మండలంలో..

భీమ్‌గల్: తనను మరోసారి ఆశీర్వదించి గెలిపించాలని, ఐదేళ్లూ ప్రజలకోసం కష్టపడతానని మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి హామీ ఇచ్చారు. మండలంలోని పల్లికొండ, బాచన్‌పల్లి, పిప్రి గ్రామాల్లో ఆయన ప్రచారం నిర్వహించారు. జెడ్పీటీసీ చౌట్పల్లి రవి, ఎంపీపీ మహేశ్, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌ను గెలిపిస్తే ఆరోగ్యబీమా



వాడిలో మాట్లాడుతున్న ముత్యాల సునీల్

వేల్పూర్: కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ప్రజలందరికీ రూ.10 లక్షల వరకు ఆరోగ్యబీమా కల్పిస్తామని బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి ముత్యాల సునీల్‌కుమార్ అన్నారు. మండలంలోని వాడి, కొత్తపల్లి గ్రామాల్లో సునీల్ శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులకు ఏకకాలంలో రూ.2లక్షల రుణమాఫీ చేస్తామని, పెట్టుబడి సహాయం కింద సంవత్సరానికి ఎకరానికి రూ.15 వేలు, వ్యవసాయ కూలీలకు ఏడాదికి రూ.12 వేలు అందిస్తామన్నారు. మహాలక్ష్మీ పథకం ద్వారా మహిళల ఖాతాల్లో నెలకు రూ.2500 జమ చేస్తామన్నారు. ఇల్లులేని పేదలకు ఇంటిస్థలం, ఇల్లు నిర్మించుకోవడానికి రూ.5 లక్షలు అందిస్తామన్నారు. బీఆర్‌ఎస్‌ను నమ్మి మోసపోయామని, వందల కోట్ల అవినీతిని ఈ ప్రభుత్వం చేసిందని ఆరోపించారు. ఈ ప్రభుత్వాన్ని గద్దె దించి, కాంగ్రెస్ పార్టీకి అవకాశం ఇవ్వాలని కోరారు. వాడి, పచ్చలనడ్కుడ గ్రామాలకు చెందిన పలువురు బీఆర్‌ఎస్ కార్యకర్తలు సునీల్‌కుమార్ ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరారు. కార్యక్రమంలో కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు అన్వేష్‌రెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సారెడ్డి, కొట్టాల చిన్నారెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌కు మాదిగ సంఘాల మద్దతు

డిచ్‌పల్లి: సార్వత్రిక ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్‌కు తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని తెలంగాణ మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి(టీఎమ్మార్పీఎస్) నాయకులు తెలిపారు. ఈమేరకు రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాంచందర్, మాదిగ ఉపకులాల మహిళ జిల్లా అధ్యక్షురాలు పులింటి ప్రకటన విడుదల చేశా రు.

షబ్బీర్‌అలీకి విద్యార్థి సంఘాలు..

ఖలీల్‌వాడి: ర్బన్ కాంగ్రెస్ అభ్యర్థి షబ్బీర్‌ఆలీకి విద్యార్థి సంఘాల నేతలు మద్దతు తెలిపారు. నగరంలోని మారుతీనగర్‌లో శనివారం టీవీయూవీ, ఏఐఎస్ఎఫ్, టీజీవీపీ, టీఎఫ్ఎస్ విద్యార్థి సంఘాల సమావేశం నిర్వహించారు. షబ్బీర్‌అలీ మాట్లాడుతూ.. తనకు మద్దతు తెలిపిన విద్యార్థి సంఘాలకు ఎల్లప్పుడూ అండగా ఉంటానని అన్నారు.

బాధ్యతాయుతంగా పనిచేస్తా



బజార్‌కొత్తూర్‌లో మాట్లాడుతున్న రాకేశ్‌రెడ్డి

నందిపేట్ (ఆర్మూర్): అసెంబ్లీ ఎన్నికల్లో తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే బాధ్యతాయుతంగా పనిచేస్తానని బీజేపీ అభ్యర్థి పైడి రాకేశ్‌రెడ్డి అన్నారు. నందిపేట్ మండలం వెల్మల్, కౌల్‌పూర్, బజార్ కొత్తూర్ గ్రామాల్లో రాకేశ్‌రెడ్డి శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కుక్కర్లు, మేక మాంసం కోసం ఓట్లు వేసి ఆగం కావొద్దని ప్రజలకు సూచించారు. ఇన్ని రోజులు చూసి కూడా మళ్లీ ఓటువేస్తే అర్థం ఉండదన్నారు. ఒక్క ఇల్లూ నిర్మించని ఎమ్మెల్యేకి ఇదే చివరి ఎన్నిక చేయాలని కోరారు. తనకు ఒక్క అవకాశం ఇస్తే ప్రతి గ్రామంలో ఇండ్లు నిర్మించే బాధ్యత తీసుకుంటానని, ఒక్క గింజ తరుగు పోకుండా ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని అన్నారు. బీజేపీ మండల అధ్యక్షుడు సాయిరెడ్డి, సాయి, మారంపల్లి గంగాధర్, ప్రవీణ్, ఎంపీటీసీ రాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రాజెక్టులు, విద్యాసంస్థలను నిర్లక్ష్యం చేశారు

రెంజల్/నవీపేట్(బోధన్): కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో నిర్మించిన ప్రాజెక్టులు, విద్యా సంస్థలను బీఆర్‌ఎస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని బోధన్ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి పొద్దుటూరి సుదర్శన్‌రెడ్డి విమర్శించారు. రెంజల్ మండలం దండిగుట్ట, నవీపేట మండల కేంద్రంలో శనివారం ఆయన మాట్లాడారు. రాష్ట్రంలోని అన్ని వర్గాల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని కాంగ్రెస్ ముందుకు సాగుతున్నదన్నారు. బీసీ, మైనార్టీ డిక్లరేషన్లను ఇప్పటికే ప్రకటించడం జరిగిందన్నారు. ముందుగానే ఆరు గ్యారంటీ పథకాలు ప్రకటించినట్లు వివరించారు. తన హయాంలో రెంజల్ గ్రామంలో మంజూరు చేసిన బందల్ల, మానపురం రోడ్ల పనులను అట్టహాసంగా ప్రారంభించిన ఎమ్మెల్యే షకీల్ ఎందుకు పూర్తి చేయలేకపోయారని ప్రశ్నించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన సంవత్సరంలో ప్రకటించిన పథకాలతో పాటు రెంజల్ రోడ్లను పూర్తి చేస్తామన్నారు. నిత్యావసర ధరలను పెంచడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పోటీపడుతున్నాయని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు బీఆర్‌ఎస్ కార్యకర్తలకే పరిమితమయ్యాయని ఆరోపించారు.

ముక్కు మూసుకోవాల్సిందే..

- దుర్గంధభరితంగా కుప్కల్ రోడ్డు
- రెండువైపులా చెత్తాచెదారం
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు



భీమ్‌గల్: పట్టణంలోని కుప్కల్ వెళ్లే రోడ్డు దుర్గంధభరితంగా మారింది. రోడ్డు మీదుగా వెళ్లాలంటే ప్రజలు ముక్కు మూసుకొని ప్రయాణం కొనసాగించాల్సిందే. రోడ్డుకు ఇరువైపులా చెత్తను పారవేస్తున్నారు. కిరాణా దుకాణాలు, ఇండ్ల నుంచి తెచ్చిన చెత్తను డంప్ చేయడంతోపాటు అక్కడే తగలబెట్టడంతో పొగ కమ్ముకుంటున్నది. చికెన్ సెంటర్ల నిర్వాహకులు తమ షాపుల్లోని వ్యర్థాలను ప్లాస్టిక్ సంచుల్లో మూటకట్టి రోడ్డు పక్కనే పారేస్తున్నారు. మేకలు, గొర్రెలు, ఇతర జంతువులు ఆకస్మికంగా చనిపోయినా.. వాటి కళేబారాలను సైతం ఇక్కడికి తీసుకొస్తున్నారు. చికెన్ సెంటర్ల నుంచి తీసుకొచ్చిన వ్యర్థాలు, కళేబరాలు కుళ్లిపోయి రోడ్డు పొడవునా దుర్గంధం వ్యాపిస్తున్నది. కస్తుర్బా గాంధీ పాఠశాల విద్యార్థినులు, టీచర్లు రోడ్డు మీదుగా వెళ్లాలంటే ఇబ్బందులు పడుతున్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ స్పందించి సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.



రోడ్డు పక్కన ప్లాస్టిక్ వ్యర్థాలు, చెత్త

అభ్యర్థులకు మద్దతుగా ప్రచారం



ముప్కాల్‌లో ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు



మాక్లూర్‌లో ప్రచారం చేస్తున్న జీవన్‌రెడ్డి సతీమణి రజితరెడ్డి

బాల్కొండ/మాక్లూర్/ఆర్మూర్: బాల్కొండ, ఆర్మూర్ నియోజకవర్గాల్లో ఆయా పార్టీల అభ్యర్థులకు మద్దతుగా వారి కుటుంబ సభ్యులతోపాటు నాయకులు, కార్యకర్తలు విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. ముప్కాల్ మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు ఇంటింటికీ వెళ్లి ఆరు గ్యారెంటీలపై అవగాహన కల్పించారు. హస్తం గుర్తుకు ఓటువేసి ముత్యాల సునీల్‌ను గెలిపించాలని కోరారు. నాయకులు మస్కు ముత్తెన్న, పృథ్వి, విజయ్‌రెడ్డి, రాములు తదితరులు పాల్గొన్నారు. ఆర్మూర్ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి పైడి రాకేశ్‌రెడ్డికి మద్దతుగా మాక్లూర్ మండలం వల్లభాపూర్, మెట్‌పల్లి గ్రామాల్లో ఆయన మేనకోడలు వాణి ఇంటింటి ప్రచారం చేశారు. నాయకులు జలంధర్, షాదు ల్లా, వంజరి సత్యమ్మ, వంజరి సుమ, జంగం విమ ల, అలీమ బేగం తదితరులున్నారు. ఆర్మూర్ పట్టణంతోపాటు పెర్కిట్, మమిడిపల్లిలో, మాక్లూర్ మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ అభ్యర్థి జీవన్‌రెడ్డికి మద్దతుగా ఆయన సతీమణి రజితరెడ్డి ప్రచారం చేశారు. తన భర్త అన్ని గ్రామాలను సమానంగా చూస్తూ అభివృద్ధే ధ్యేయంగా ముందుకు సాగారన్నారు. మరోసారి జీవన్‌రెడ్డిని గెలిపించాలని ఆమె కోరారు. మాక్లూర్ సర్పంచ్ బి అశోక్‌రావు, కో ఆప్షన్ సభ్యుడు కోకా హైమద్, బీఆర్‌ఎస్ నాయకులు రమణారావు, లక్ష్మీనారాయణ, కరీం తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిని విస్మరించారు



తుంగినిలో ప్రచారం చేస్తున్న మోహన్‌రెడ్డి

నవీపేట : గతంలో బోధన్ ఎమ్మెల్యేలుగా పనిచేసిన సుదర్శన్‌రెడ్డి, షకీల్ అభివృద్ధిని విస్మరించారని బీజేపీ అభ్యర్థి వడ్డి మోహన్‌రెడ్డి ఆరోపించారు. మండలంలోని నాళేశ్వర్, తుంగిని, నిజాంపూర్, లింగాపూర్, శాఖాపూర్, సిరన్‌పల్లి గ్రామాల్లో మోహన్‌రెడ్డి శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గెలుపొందిన ఎమ్మెల్యేలు అసెంబ్లీలో సమస్యలను ప్రస్తావించకుండా సీట్లకే పరిమితమయ్యారన్నారు. జడ్పీ ఫ్లోర్ లీడర్‌గా జిల్లా పరిషత్‌లో మంత్రులను సమస్యలపై నిలదీసిన అనుభవంతో అసెంబ్లీలో సమస్యలను ప్రస్తావిస్తానని అన్నారు. సీఎం కేసీఆర్ నిరుద్యోగులకు మొండి చేయి చూపారని ఆవేదన వ్యక్తం చేశారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మేడపాటి ప్రకాశ్‌రెడ్డి, నాయకులు నర్సింహారెడ్డి, అడ్లూర్ శ్రీనివాస్, ద్యాగ సరిన్, మాణికేశ్వర్‌రావ్, సంతోష్, శ్రీధర్, సుదర్శన్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీకి అవకాశం ఇవ్వండి



మాట్లాడుతున్న ఏలేటి అన్నపూర్ణమ్మ

భీమ్‌గల్ : బాల్కొండ నియోజకవర్గంలో బీజేపీకి ఒక్కసారి అవకాశం ఇస్తే ఎప్పుడూ చూడనంత అభివృద్ధి చేసి చూపిస్తానని ఆ పార్టీ అభ్యర్థి ఏలేటి అన్నపూర్ణమ్మ హామీ ఇచ్చారు. మండలంలోని కుప్కల్, జాగిర్యాల్ గ్రామాల్లో అన్నపూర్ణమ్మ శనివారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. డబుల్ ఇంజిన్ సర్కార్ వస్తే ప్రతి వ్యక్తికి న్యాయం జరుగుతుందన్నారు. బీఆర్‌ఎస్, కాంగ్రెస్ నాయకులు చేస్తున్న అవినీతి, అక్రమాలను రూపుమాపాలంటే బాల్కొండలో బీజేపీని గెలిపించాలని కోరారు. బీజేపీని గెలిపిస్తే అర్హులందరికీ ఇండ్లు, పెన్షన్లు, రేషన్ కార్డులు ఇప్పిస్తామని అన్నారు. కార్యక్రమంలో అసెంబ్లీ కన్వీనర్ మల్కన్న గారి మోహన్, పిల్లోల్ల గంగాస్వామి, సంజీవ్, కార్యకర్తలు పాల్గొన్నారు.

కాంగ్రెస్, బీజేపీల్లో చేరికలు



కాంగ్రెస్‌లో చేరిన నాయకులతో సుదర్శన్‌రెడ్డి



కాంగ్రెస్‌లో చేరిన వారితో వినయ్‌రెడ్డి

రెంజల్/నవీపేట/ఎడపల్లి/కమ్మర్‌పల్లి/బాల్కొండ/మాక్లూర్/నందిపేట : కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థుల సమక్షంలో పలువురు ఆ పార్టీల్లో చేరారు. బోధన్ కాంగ్రెస్ అభ్యర్థి పొద్దుటూరి సుదర్శన్‌రెడ్డి సమక్షంలో నవీపేట, ఎడపల్లి, రెంజల్ మండలాలకు చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు, యువకులు కాంగ్రెస్‌లో చేరారు. వారికి సుదర్శన్‌రెడ్డి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. రెంజల్‌కు చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు ఆసాని వేణుతోపాటు వార్డు సభ్యుడు అగ్గు వెంకట్, నవీపేట మండల బీఆర్‌ఎస్, బీజేపీలకు చెందిన యువకులు, ఎడపల్లి మండలం కుర్నాపల్లికి చెందిన ముదిరాజ్ కులస్తులు తదితరులు కాంగ్రెస్‌లో చేరినవారిలో ఉన్నారు. బాల్కొండ నియోజకవర్గ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు నేల్ల లింగన్న సునీల్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. సావెల్ గ్రామ సర్పంచ్ నేల్లా లావణ్య, ముప్కాల్ మండలం వేంపల్లి మాజీ సర్పంచ్ కుమ్మరి మల్కన్నతోపాటు మరికొంత మంది బీఆర్‌ఎస్ నాయకులు కాంగ్రెస్‌లో చేరగా, వారికి సునీల్‌రెడ్డి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కమ్మర్‌పల్లి మండలం బషీరాబాద్‌కు చెందిన వంద బీఆర్‌ఎస్ నాయకులతోపాటు చౌట్‌పల్లికి చెందిన బోగ సుమన్ కాంగ్రెస్‌లో చేరిన వారిలో ఉన్నారు. నందిపేట మండలం ఖుద్వాన్‌పూర్ మాజీ ఉపసర్పంచ్ మంగళరావు చిరంజీవి, బీజేపీ నాయకుడు రాపెల్లి సతీశ్, వార్డు మెంబర్లు డాక్టర్ కాలూరి రవికాంత్, గోక పుష్ప, గుంరెడ్డి భోజమ్మ, అహ్మద్ బీ, గుండు నర్సుబాయి తదితరులు ఆర్మూర్ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి వినయ్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు.

బీజేపీలో..

ముప్కాల్ మండలం నల్లూర్ మాజీ సర్పంచులు అక్కపత్రి గంగాధర్, శ్రీనివాస్ ఏలేటి అన్నపూర్ణమ్మ సమక్షంలో బీజేపీలో చేరారు. ముప్కాల్‌కు చెందిన వడ్డెర, వడ్రంగి కులస్తులు, భీమ్‌గల్ మండలం మెండోరాకు చెందిన బీఆర్‌ఎస్, కాంగ్రెస్ నాయకులు బీజేపీలో చేరారు. మాక్లూర్ మండలం దుర్గానగర్‌కింది తండా, మానిక్‌బండార్ తండాకు చెందిన గిరిజనులు బీజేపీలో చేరారు. మదన్‌పల్లి ఎంపీటీసీ గోవూరు ఒడ్డెన్న, మాజీ జడ్పీటీసీ లతాపీర్ సింగ్ ఆధ్వర్యంలో చేరికలు జరిగాయి. వల్లభాపూర్‌కు చెందిన అంకంపల్లి జనార్దన్ కాంగ్రెస్ నుంచి బీజేపీలో చేరారు. ఆర్మూర్ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి పైడి రాకేశ్‌రెడ్డి వారందరికీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

ఘనంగా జాతీయ విద్యా దినోత్సవం



నగరంలో మాట్లాడుతున్న ప్రేమ్‌లాల్



సిరికొండలో నివాళులు అర్పిస్తున్న ఉపాధ్యాయులు

నిజామాబాద్‌నాగారం: నగరంలోని తెరవే (తెలంగాణ రచయితల వేదిక) కార్యాలయంలో శనివారం మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతిని పురస్కరించుకొని జాతీయ విద్యా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా తెరవే జిల్లా అధ్యక్షుడు ప్రేమ్‌లాల్ మాట్లాడుతూ.. విద్యార్థులను భవిష్యత్ పౌరులుగా తీర్చిదిద్దే ప్రయోగశాలలే పాఠశాలలు అని పేర్కొన్నారు. సంఘ సభ్యులు అనిత, శోభ, ప్రసన్నకుమారి ఉన్నారు.

సిరికొండ: మండల కేంద్రంలోని కిడ్స్‌పార్క్ పాఠశాలలో శనివారం జాతీయ విద్యా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అబుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి కరస్పాండెంట్ జాకీర్ హుస్సేన్, ఉపాధ్యాయులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

దీపావళి వేడుకలు

పెర్కిట్(ఆర్మూర్): మున్సిపాలిటీ పరిధిలోని మామిడిపల్లిలో ఉన్న తపస్వీ తేజో నిలయంలో రోటరీ క్లబ్ ఆఫ్ ఆర్మూర్ ఆధ్వర్యంలో శనివారం దీపావళి వేడుకలను నిర్వహించారు. క్లబ్ సభ్యులు తపస్వీ తేజో నిలయం విద్యార్థులకు మిఠాయిలు, పటాకులు అందజేశారు. రోటరీ క్లబ్ ఆఫ్ ఆర్మూర్ అధ్యక్షుడు పట్వారి గోపి, కార్యదర్శి తులసి, కోశాధికారి లక్ష్మీ నారాయణ, సభ్యులు పుష్పాకర్‌రావు, చౌటి లింబాద్రి తదితరులు పాల్గొన్నారు.

పటాకుల దుకాణాల్లో సందడి



ఆర్మూర్‌టౌన్: దీపావళి సందర్భంగా పట్టణంలోని సిద్దులగుట్ట వెనుకప్రాంతంలో పటాకులు దుకాణాలు వెలిశాయి. పట్టణానికి చెందినవారితోపాటు ఆయా గ్రామాల నుంచి వచ్చిన కొనుగోలుదారులతో సందడిగా మారాయి. పంత్‌రోడ్డులోని దుకాణాల్లో దీపాలు, పూజాసామగ్రి కొనుగోలు చేశారు.

సినిమాలు తెలుగు/హిందీ/ఇంగ్లీష్



పీవీఆర్ మల్టీప్లెక్స్(ఆర్మూర్)

స్క్రీన్-1 – ది మార్వెల్స్ (తెలుగు)- 11.15, 1.50, 7.10, 9.45
దీపావళి (తెలుగు) - 04.25

స్క్రీన్-2 – జపాన్ (తెలుగు)- 12.10, 3.30, 6.50, 10.10

స్క్రీన్-3 – జపాన్ (తెలుగు)- 10.50
కీడా కోలా(తెలుగు)- 2.10, 7.40
మా ఊరి పొలిమేర (తెలుగు)- 4.50, 10.20

స్క్రీన్-4 – జిగర్ తండ డబుల్‌ఎక్స్ (తెలుగు)- 11.15, 2.50, 6.25, 10.00